క్లుప్తంగా

రిమ్స్‌లో అన్నదానం

కడప కల్చరల్ : కడప నగరం రిమ్స్ ఆవరణలో ఆదివారం బాసట స్వచ్ఛంద సేవా సంస్థ అన్నదానం చేసింది. ఆస్పత్రిలోని రోగుల సహాయకులు దాదాపు 250 మందికి సంస్థ అన్నదాన బృందం ప్రతినిధి కె.చంద్రమౌళిరెడ్డి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సహకరించి సంస్థ డీపీ కార్తీక్‌రెడ్డికి, ఆయన మిత్రబృందాన్ని సంస్థ అధ్యక్షులు మేరువ బాలాజీరావు కృతజ్ఞతలు తెలిపారు.

ఆదాయ పన్ను నిబంధనలు సవరించాలి

– ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్

కడప ఎడ్యుకేషన్: ఆదాయ పన్ను నిబంధనలను ప్రభుత్వం సరళతరం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్ కోరారు. ఆదివారం కడపలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదాయ పన్ను రిటర్న్స్‌పై అధికారులు ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలని ఈనెల 25వ తేదీ వరకు గడువు ఇవ్వాలని కోరారు. వివిధ రకాల సమస్యలతో ఆదాయపన్ను రిటర్న్స్ దాఖలు చేయడంతో ఆలస్యం జరుగుతున్న వారికి మినహాయింపు ఇవ్వాలన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీవీ ప్రసాద్ మాట్లాడుతూ ఇంటి అద్దె మినహాయింపులు కోసం ఆదాయపన్ను శాఖ నిర్దేశించిన రెండవ సూత్రం వల్ల ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. దీనిని సవరించాలని డిమాండ్‌చేశారు. పెరిగిన వేతనాలు, ఇంటి అద్దెలు దృష్టిలో ఉంచుకుని పాన్‌కార్డు లేకుండా లక్ష వరకు ఉన్న అనుమతిని రెండు లక్షలకు పెంచేలా చూడాలన్నారు. అన్నమయ్య జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అలీఖాన్, చంగల్‌రెడ్డి, నాయకులు ఈశ్వర్‌చంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

14న ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయం వద్ద ఆందోళన

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఆర్టీసీ బస్టాండ్లను ప్రైవేట్ సంస్థలకు లీజుకు కట్టబెట్టాలనే ప్రయత్నాలను నిరసిస్తూ ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయం వద్ద ఈ నెల 14న ఆందోళన చేపట్టనున్నట్లు సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ బస్టాండులను 33 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చి ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలనే చర్యలను మానుకోవాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు ఎక్కువ కాలం లీజుకు కట్టబెట్టడం ద్వారా రానున్న కాలంలో ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలో కొనసాగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ విషయమై పునరాలోచించాలని కోరారు.


మహిళల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పాలక ప్రభుత్వాలు పరిష్కరించాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బషీరున్నీసా డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని శంకరాపురంలో నిర్వహించిన ఏపీ మహిళా సమాఖ్య జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం పార్లమెంట్‌లో చట్టం తీసుకురావాలన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలిగా విమల, కార్యదర్శిగా వెంకట రమణమ్మ, సహాయ కార్యదర్శిగా రమాదేవితో పాటు పలువురిని ఎన్నుకున్నారు.

ఎలక్ట్రికల్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి

కడప కార్పొరేషన్: జిల్లాలోని ఎలక్ట్రికల్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పవర్ అల్తాఫ్ అన్నారు. ఆదివారం వేంపల్లి అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఎలక్ట్రికల్ వర్కర్ల సమస్యల గూర్చి చర్చించారు. ఈ సందర్భంగా పవర్ అల్తాఫ్ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ఎలక్ట్రికల్ వర్కర్లకు రావాల్సిన పథకాలు, బీటీసీ కార్డుల కోసం కృషి చేస్తామని తెలిపారు. జిల్లా కార్యదర్శి సుజాన్, కోశాధికారి ప్రసాద్, వేంపల్లి అధ్యక్షుడు ముని, ప్రధాన కార్యదర్శి గౌస్ పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఐటీ అధ్యాపకురాలికి డాక్టరేట్



లెక్కల పద్మావతి

కడప ఎడ్యుకేషన్: సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో మ్యాథమేటిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న లెక్కల పద్మావతికి అనంతపురం జేఎన్‌టీయూ వారు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్ రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పాండురంగన్, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరెడ్డి ఆమెకు అభినందనలు తెలిపారు.

నగరాభివృద్ధిపై చర్చకు సిద్ధం

- అంజద్‌బాషా హస్తవాసి బాగుందనే ప్రారంభోత్సవాలకు ఆహ్వానిస్తున్నారు
- టీడీపీ నాయకులది ఐరన్ లెగ్
- ధ్వజమెత్తిన వైఎస్సార్‌సీపీ నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్: కడప నగరాభివృద్ధిపై ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమని వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారెడ్డి, షఫీ, బంగారు నాగయ్య యాదవ్ సవాల్ విసిరారు. ఆదివారం స్థానిక డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. అన్నమయ్య జిల్లాకు చెందిన శ్రీనివాసులరెడ్డి కడప నగరం గురించి, దాని అభివృద్ధి గూర్చి మాట్లాడటం సరికాదన్నారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా కడప అభివృద్ధికి రూ.4లక్షలు కూడా మంజూరు చేయించలేదని చెప్పడం హాస్యాస్పదమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క కడప నగరంలోనే రూ.500కోట్లకుపైగా పనులు జరుగుతున్నాయన్నారు. ఎర్రముక్కపల్లె–రైల్వేస్టేషన్ రోడ్డు, మహావీర్ సర్కిల్–రిమ్స్ రోడ్డు విస్తరణ పూర్తయ్యాయని, మరో మూడు రోడ్ల విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. ప్రజలందరినీ రోడ్ల విస్తరణకు ఒప్పించడమేగాక, తన ఆస్తులను కూడా రోడ్డు విస్తరణకు ఇచ్చిన ఘనత డిప్యూటీ సీఎం అంజద్‌బాషాదేనన్నారు. కడపలో ఏడు అర్బన్ హెల్త్ సెంటర్లు నిర్మాణం అవుతున్నాయని, ఒక్కో హెల్త్ సెంటర్ రూ.80లక్షలతో నిర్మిస్తున్నారన్నారు. అంజద్‌బాషా హస్తవాసి బాగుంది కాబట్టే ప్రతి ఒక్కరూ ప్రారంభోత్సవాలకు ఆహ్వానిస్తున్నారని, టీడీపీ నాయకులది ఐరన్ లెగ్ అని, వారు ఏ షాపు ప్రారంభించినా మూసుకోవాల్సిందేనన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాకుగానీ, కడప నగరానికిగానీ ఎన్ని నిధులు తెచ్చి, ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తోట క్రిష్ణ, కోలా కొండయ్య, ఉమైర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నాగరాజు

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం కిమ్స్ సవేరా ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వివిధ రకాల జబ్బులకు సంబంధించి 140 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు డాక్టర్ నాగరాజు, కిమ్స్ ఆసుపత్రి డాక్టర్ రామాంజనేయులు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 12 మందిని మెరుగైన వైద్యం కోసం పెద్దాసుపత్రులకు రెఫర్ చేసినట్లు తెలిపారు. వైద్య పరీక్షలతోపాటు వారికి సరిపడా మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం ఆంజనేయులు, ఆసుపత్రి సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు : శ్రీవెంకటేశ్వర హెల్పింగ్ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీకేఎస్‌ఆర్ హాస్పిటల్ వారి సహకారంతో ఆదివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జెడ్పీటీసీ ముదిరెడ్డి దిలీప్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ నవీన్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ విజయలక్ష్మిల ఆధ్వర్యంలో శిబిరానికి వచ్చిన వారికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఎర్రసాని మోహన్‌రెడ్డి, మండల కో ఆప్షన్ మెంబర్ వారిష్, వైఎస్సార్‌సీపీ నాయకులు సురతాని శ్రీనివాసులు, ప్రదీప్‌రెడ్డి, డాక్టర్ పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి



ప్రత్యేక పూజలందుకుంటున్న గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో బంధుమిత్రులతో విందుభోజనాలను చేశారు. అలాగే ఆలయ సమీపంలోని ఆంజనేయస్వామి, సాయిబాబా, వైద్యనాథేశ్వరుడు, అక్కదేవతలు, వీరభద్రుడు, నవగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కేసీ కెనాల్‌లో పూడికతీత పనులు



పూడికను తొలగిస్తున్న జేసీబీ

చెన్నూరు : స్థానిక కొత్తరోడ్డు వద్ద కేసీ కెనాల్ వెంబడి సైడ్‌వాల్ దెబ్బతిని వ్యర్థాలు, పిచ్చి మొక్కలతో కెనాల్ పూడిపోవడంతో పంచాయతీ అధికారులు ఆదివారం జేసీబీ సాయంతో పూడికతీత పనులు చేపట్టారు. సర్పంచ్ సిద్ధిగారి వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ ముదిరెడ్డి సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో కెనాల్‌లోని వ్యర్థాలు, పిచ్చిమొక్కలను తొలగించారు. అలాగే కాలువ ఇరువైపులా సైడ్‌వాల్ దెబ్బతినిందని, కేసీ కెనాల్ అధికారులు కాలువ మరమ్మతు పనులు చేపట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై పోలీసుల దాడులు



నాటుసారా తయారీదారుల ఇళ్లలో సోదాలు చేస్తున్న పోలీసులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని నగరిగుట్ట, చిన్నన్న రూముల వీధి, బయమ్మ తోట తదితర ప్రాంతాలలో నాటుసారా స్థావరాలు ఉన్నట్లు సమాచారం రావడంతో అర్బన్ సీఐ రాజు, ఎస్‌ఐలు చిరంజీవి, హుస్సేన్, ఎస్‌ఈబీ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్‌లు ఆదివారం దాడులు చేపట్టారు. జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు నాటుసారా విక్రయిస్తున్న ఇళ్లల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి గతంలో నాటుసారా విక్రయిస్తున్న వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటుసారా తయారీ చేసినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం కూడా నాటు సారా తయారు చేయకుండా ఉన్న కుటుంబాలను చూసి చిన్న, చిన్న వ్యాపారాలు చేసుకునే విధగా రుణాలు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పోలీసులు, ఎస్‌ఈబీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో చిన్నారుల సందడి



శిల్పారామంలో యువకుల నృత్య ప్రదర్శనలు

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. స్థానిక చిన్నారులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. చిన్నచిన్న సరదా నాటికలతో అలరించారు. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

చాపాడు: మండలంలోని నాగాయపల్లె గ్రామంలో రామాలయ విగ్రహ ప్రతిష్ట వేడుకల సందర్భంగా ఆదివారం నిర్వహించిన బండలాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం జరిగిన పోటీల అనంతరం బండ విరిగిపోవడంతో మధ్యాహ్నం నుంచి మరో బండతో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రెండు విభాగాల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు వేర్వేరుగా నగదు బహుమతులు అందజేశారు. ఉదయం నిర్వహించిన పోటీల్లో మైదుకూరుకు చెందిన కుర్ర వెంకటేషు ఎద్దు 2870.7 అడుగులతో ప్రథమ స్థానంలో నిలిచాయి. లింగాయపల్లెకు చెందిన పులవుల సురేష యాదవ్ ఎద్దు 2823.5 అడుగులతో ద్వితీయ స్థానం, బాలయ్యగారిపల్లెకు చెందిన నంద్యాల విష్ణువర్ధన్ ఎద్దు 2655 అడుగులతో తృతీయ స్థానం, కలసపాడుకు చెందిన బేతి వెంకటరెడ్డి ఎడ్ల 2200 అడుగులతో నాలుగో స్థానంలో నిలిచాయి. ఎడ్ల యజమానులకు వరుసగా రూ.20వేలు, రూ.15, రూ.10 రూ.5వేలు నగదు బహుమతులు అందజేశారు. అనంతరం మధ్యాహ్నం నుంచి నిర్వహించిన పోటీల్లో తలపూరుకు చెందిన అరవింద నాయుడు ఎద్దు 2098 అడుగులతో ప్రథమ, ప్రొద్దుటూరుకు చెందిన ద్వార్శల గురివిరెడ్డి ఎద్దు 2046.1 అడుగులతో ద్వితీయ, నంద్యాల జిల్లా పీఆర్ పల్లెకు చెందిన బయపురెడ్డి ఎద్దు 1665.5 అడుగులతో తృతీయ, నెల్లూరు జిల్లా రామనపాలెంకు చెందిన బుల్స్ మధురెడ్డి ఎడ్ల నాలుగో స్థానంలో నిలిచాయి.

ఉత్తమ గురువు రామస్వామి

– ఆర్‌జేయూపీ రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, దివంగత రామస్వామి జీవితం, ఉద్యోగ ఉపాధ్యాయులకు చేసిన సేవలు అందరికీ ఆదర్శం అని ఆర్‌జేయూపీ రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం ఆయన 82వ జయంతిని పురస్కరించుకుని కడప ఆర్‌జేయూపీ భుజంగరావు స్మారక టీచర్స్‌భవన్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబుల్‌రెడ్డి, టీచర్స్ హోం ప్రధాన కార్యదర్శి వెంటసుబ్బయ్య, ఉపాధ్యక్షులు ప్రసాదరావు, సినియర్ నాయకలు వెంకటేశ్వరెడ్డి, ఆసర్ రామెహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై శ్రీరంగనాథుడు



అలిగి వెళుతున్న శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు



అశ్వవాహనంపై శ్రీరంగనాథుడు

పులివెందుల టౌన్ : పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్ వద్ద ఉన్న శ్రీరంగనాథుని కాంప్లెక్స్‌లో ప్రాచీన దేవాలయమైన శ్రీరంగనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా 8వ రోజు ఆదివారం రాత్రి శ్రీరంగనాథస్వామి అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారు వేటా మార్గమున వెలుతున్న తీరును కళ్లకు కట్టినట్లుగా భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి అశ్వవాహనంపై వెలుతున్న తీరు, అమ్మవార్లు ముందు పల్లకిలో అలిగినట్లు వెలుతున్న దృశ్యాన్ని భక్తులను విశేషంగా అకట్టుకుంది. శ్రీరంగనాథస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల గుండా ఊరేగించారు. స్వామి వారికి భక్తులు కాయ కర్పూరాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామోత్సవంలో భక్తులు చదుర్లు(విశేష పూజలు) నిర్వహించారు. తిరుణాల ప్రాంగణంలో సాయంత్రం రాజా కళానికేతన్ చిన్నారులచే నృత్యప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ కె.వి.రమణలు, సభ్యులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు :

శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు నేటితో ముగియనున్నాయి. 8 రోజులుగా స్వామివారు వివిధ అలంకారాలతో భక్తులకు దర్శనమిచ్చి కనువిందుచేశారు. భక్తులు స్వామిని దర్శించి తరించారు. 9వ రోజు చివరిరోజు సోమవారం శ్రీరంగనాథుడు సతీసమేతుడై హంసవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

హజ్ హౌస్ పరిరక్షణకు చర్యలు చేపట్టాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో ముస్లిం సంఘాల నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ సలావుద్దీన్

కడప రూరల్ : కడప నగర శివార్లలో నిర్మించిన హజ్ హౌస్ పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ముస్లిం సంఘాల నేతలు కోరారు. ఆదివారం స్థానిక ఏకే ఫంక్షన్ హాలులో సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ ఆధ్వర్యంలో హజ్‌హౌస్ పరిరక్షణ కమిటీ ఏర్పాటు కోసం ముస్లిం సంఘాల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిలానీబాషా, అమీర్‌బాబు, జమీల్, దస్తగిరి, సయ్యద్ సలావుద్దీన్ మాట్లాడుతూ 2019లో రూ. 26 కోట్లతో హజ్‌హౌస్‌ను నిర్మించారన్నారు. రాయలసీమ జిల్లాలతోపాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు కేంద్రంగా ఇక్కడ హజ్ హౌస్ ఏర్పడిందన్నారు. కడప ఎయిర్‌పోర్టును అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుగా తీర్చిదిద్ది పవిత్రహజ్ యాత్ర ఇక్కడి నుంచే కొనసాగేలా చర్యలు చేపట్టాలన్నారు. కాగా, హజ్‌హౌస్ పరిరక్షించడంతోపాటు ఎయిర్ పోర్టును అభివృద్ధి చేయడం వల్ల అరబ్ దేశాలలో ఉపాధి పొందుతున్న రాయలసీమ వాసులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. హజ్‌హౌస్ పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సయ్యద్ అహ్మద్, రఫీక్‌ఖాన్, షేక్ ఆరీఫ్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నాగరాజుపేట మున్సిపల్ హైస్కూల్ (గూండాచారి స్కూల్) 1986-87 బ్యాచ్ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: కడప నాగరాజుపేట మున్సిపల్ హైస్కూల్ (గుండాచారి స్కూల్)లో 1986–87 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. దాదాపు 35 ఏళ్ల తరువాత కలుసుకున్న వారు ఎంతో ఆప్యాయంగా పలకరించుకుంటూ మురిసిపోయారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ ఉపాధ్యాయురాలు ప్రభావతమ్మ, ఆలీసమ్మ మాట్లాడుతూ విద్యార్థులలో విలువలను పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమకు విద్యాబోధనలు చేసిన గురువులను సత్కరించి వారి ఆశీర్వాదాలను తీసుకున్నారు.

విద్యావేత్త రామమూర్తిరెడ్డికి సత్కారం



విద్యావేత్త రామమూర్తిరెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ సీ. రామచంద్రయ్య

కడప కార్పొరేషన్: ప్రముఖ విద్యావేత్త, విద్యామందిర్ పాఠశాల వ్యవస్థాపకులు రామమూర్తిరెడ్డిని శాసనమండలి సభ్యులు సి.రామచంద్రయ్య ఘనంగా సత్కరించారు. రామమూర్తి రెడ్డి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్సీ ఆయన నివాసానికి వెళ్లి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా సీఆర్‌సీ మాట్లాడుతూ అమెరికాలో పీహెచ్‌డీ చేసి కడపలో విద్యామందిర్ పాఠశాల, చక్కెర కర్మాగారం స్థాపించి రామమూర్తిరెడ్డి కడపకు ఎనలేని సేవలు అందించారని తెలిపారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాకారుడికి సన్మానం



సాఫ్ట్‌బాల్ క్రీడాకారుడు సూరిబాబును సత్కరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో ప్రతిభ చూపిన పులివెందులకు చెందిన క్రీడాకారుడు సూరిబాబును మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈనెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఒరిస్సా రాష్ట్రంలోని పూరి జిల్లాలో జరిగిన 44వ జాతీయస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలలో రాష్ట్రస్థాయి జట్టు తరపున పులివెందులకు చెందిన సూరిబాబు పాల్గొని మంచి ప్రతిభ కనబరిచారు. మానవత సంస్థ స్థానిక రమణప్ప సత్రంబడి పాఠశాలలో క్రీడాకారుడు సూరిబాబుకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌తో కలిసి శాలువా కప్పి మెడల్‌తోపాటు మెమెంటోను అందించి సత్కరించారు. కార్యక్రమంలో మానవత సంస్థ చైర్మన్ రిటైర్డు పీఈటీ కొండారెడ్డి, మానవత సంస్థ సభ్యులు, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ ప్రసాద్, అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, పీఈటీ శ్రీకాంత్‌రెడ్డి, పులివెందుల సీనియర్ సాఫ్ట్ బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కమలాపురం : పట్టణ శివారులోని పాగేరు వంక ఒడ్డున ఉన్న పొలాల్లో జూదమాడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. జూదమాడుతున్న సమాచారం రావడంతో ఎస్‌ఐ తన సిబ్బందితో కలసి జూద స్థావరంపై దాడి చేశారు. వడ్డె ఆనంద్‌తో పాటు మరో ముగ్గురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.10,600 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు.

నేషనల్ మజ్దూర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా శివారెడ్డి

జమ్మలమడుగు : ఆంధ్రప్రదేశ్ నేషనల్ యూనిటి అసోసియేషన్ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడిగా మూడోసారి పి.వి.శివారెడ్డి ఎన్నిక పట్ల నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం డిపో కార్యదర్శి ఎస్ఎం వలి, జీఎస్కేరెడ్డి, వెంకటస్వామి విజయ్‌లు శివారెడ్డికి సన్మానం చేశారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ కార్మికుల నాయకుడిగా కార్మికుల సమస్యలపై పోరాటం కోసం తనవంతు బాధ్యతగా ప్రతి ఒక్కరికీ సహకరిస్తామన్నారు.

14నుంచి జీవధార ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

బ్రహ్మంగారిమఠం: శ్రీపోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో దాదాపు 100 ఏళ్ల నాడు ప్రతిష్టింపబడిన ధ్వజస్తంభం దెబ్బతినడంతో తిరిగి నూతన ధ్వజస్తంభం ఏర్పాటు చేయనున్నారు. ఈనెల 14 నుంచి 16 వరకు జీవధార ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తునట్లు మఠం మేనేజర్ ఈశ్వరాచారి ఆదివారం తెలిపారు. పూర్వ మఠాధిపతులు వీరభోగవసంత వెంకటేశ్వర స్వామి ఉన్నప్పుడే ధ్వజ స్తంభం మార్చాలని సంకల్పించారు. ఇప్పటికి కార్యరూపం దాల్చిందన్నారు. మఠం పిట్‌పర్సన్, ఎండోమెంట్ ఏసీ శంకర్ బాలాజీ ఆధ్వర్యంలో పూర్వపు మఠాధిపతుల కుమారులు, వారి ధర్మపత్ని మారుతీ మహాలక్షమ్మ సంమక్షంలో ఈ మహోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ధ్వజస్తంభం శాశ్వత దాతలు కలసపాడు మండలం ఎగువ తంబళ్లపల్లె గ్రామస్తులు గంగసాని వంశస్తులచే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ధ్వజస్తంభ ప్రతిష్ఠను విజయవంతం చేయాలని కోరారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

కడప అర్బన్: ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిల్లో పోలీసు అధికారులు, తమ సిబ్బందితో కలిసి వాహనాల స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో మొత్తం 108 కేసులు నమోదు చేశారు. ఇందులో ప్రధానంగా హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడిపిన వాహనదారులపై 100 కేసులు, సీటు బెల్ట్ ధరించకుండా వెళ్తున్న కార్లు, జీపుల డ్రైవర్లపై 8 కేసులు నమోదు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

లింగాల : మండల కేంద్రమైన లింగాలలో ఆదివారం పోలీసులు జూదశాలలపై దాడులు నిర్వహించారు. వనంబావి సమీపంలోని పొలంలో నిర్మించుకున్న ప్యాక్ హౌస్‌లో జూదమాడుతున్న వారిపై ఎస్‌ఐ హృషికేశవరెడ్డి దాడులు నిర్వహించి 10మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.20వేల నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.